సాగుతున్న యాత్ర

కనిచీకటి వేళ...

ఏడ్చి ఏడ్చి అలసిన ఆడపిల్ల మొహంలా వుంది ఆకాశం.

మబ్బు బొమ్మల్ని పరికిస్తోంది... రామసీత. చల్లగా గాలి వీస్తోంది. నిన్ననే కార్తీకం వచ్చింది. టెర్రెస్‌మీద పిట్టగోడ వారగా పూలకుండ్లు. లిల్లీ చెట్టు అలవోకగా కదులుతోంది. రమణ ఉత్తరం వుంది, చేతిలో. రామసీత అలోచనలు గతాన్ని వెతుక్కున్నాయి.

***

అంతకుముందు రెండు వారాల క్రితం తను బెరుకు బెరుగ్గా చెప్తే... 'పండగ వెళ్లనీ, చూద్దాం' అన్నాడు ఆనందం. పండగ వచ్చి వెళ్ళింది. పిల్లలు... రమణ, రాణి... వచ్చివెళ్ళారు. ఈ సారి దీపావళికి వాళ్లకి సెలవేలేదు. శనివారం ఆదివారం వుండి, సోమవారం ఉదయాన్నే ప్రయాణం కట్టారు. అమ్మకూడా.... 'వాళ్ల చదువులు పోతాయ్. మమ్మల్ని వెళ్లనీ' అంది.

తన పిల్లల పోషణతో తల్లి పడుతున్న అవస్థల్ని తలచుకుంటే... రామసీతకు బాధ, తల్లి పట్ల జాలీ కలుగుతై. కానీ, తనకు వేరే దారిలేదు. వాళ్ల బాధ్యతని తల్లి నెత్తిన పెట్టక తప్పలేదు.

పెళ్లికి ముందు నుంచీ చాలా చాలా ఆలోచనలున్నై తనకు. కానీ, అవేవీ సాగలేదు. చేస్తున్న ఉద్యోగం మానటానికి వీల్లేదన్నాడు ఆనందం. రమణ పుట్టంగానే వాడిని సాకటంగురించి జరిగిన చర్చలూ, వాదాలూ.... తలచుకుంటే రామసీతకి వొళ్లు జలదరిస్తుంది.

వాడి బారసాల రోజు రాత్రి ...

ఇటువైపు తన అత్తగారు, ఆడపడచు, ఆనందం. అటువైపు తన తల్లి,తండ్రీ, తమ్ముడూ....

నాందీ, ప్రస్తావనలు దాటి, సంభాషణ సాగి, చర్చల్లోకిదిగి, వాదాల్లో మునిగి, గొంతులు చించుకుని, ముఖాలు మాడ్చుకొని, చివరకి వొప్పందాలు కుదుర్చుకున్నారు. రమణని తన అమ్మే తీసుకెళ్లేటట్లు. మూడో నెల రాగానే తను వచ్చేసింది, రమణని అమ్మకు వొప్పచెప్పి.

కొత్తల్లో తనకూ ఆనందంకీ కూడా చాలా బెంగగా వుండేది. పిల్లవాడు తమ దగ్గర లేకపోవడం ఎంతో లోటుగా తోచేది.

రోజులు గడుస్తున్న కొద్దీ... తమ ఉద్యోగాల హడావిడిలో, ఉరుకులు పరుగుల యాంత్రిక జీవనంలో.... ఆ బెంగ, ఆ లోటు... స్థాయి తగ్గి, అలవాటుగా మళ్లీ తామిద్దరే పెళ్లయిన కొత్తల్లోలా వుండసాగారు. వారం వారం కొడుకు కోసం హైదరాబాద్ నుంచీ వరంగల్ ప్రయాణం. సోమవారం తిరిగిరావడం. క్రమం సాగిపోతుంది.

ప్రకృతి చాపకిందినీరులా.... ద్రవీభవించి కాలాన్ని కరిగించింది. కళ్ళు విప్పి చూసుకునేసరికీ సమయం మించి పోయింది. కూతురు దగ్గర మకాంలో ఉన్న అత్తమ్మ వచ్చి చాలా చాలా సుద్దులు చెప్పింది. కళ్ళనీళ్ళు పెట్టుకుంది; కన్నెర్రచేసింది. అత్తగారి అధారిటీ చూపింది., కొడుకుని ఒప్పించకలిగింది. తను అమ్మదగ్గరికి పరిగెత్తింది. చాలా కాండ జరిగాక, "ఆడపిల్ల నట్టింట్లో తిరుగుతుంటే అదో అందం, ఆనందం, ఇంటికి శోభ" అని మురిపెంగా తన కళ్లల్లోకి చూసింది. ముసిముసిగా గర్వంగా నవ్వుకుంది. అవును మరి.... ఆమెకి మేము అయిదుగురు ఆడపిల్లలం!

రాణి పుట్టింది.

తన మెటర్నిటీ లీవ్ కాగానే తానే వెళ్లి వరంగల్‌లో అమ్మకి రాణిని అప్పచెప్పి

వచ్చేసింది.

ఈ సారి ఏ చర్చలూ, వాదాలూ లేవు. అంతా ముభావంగా, మ్రుసురుముసురుగా జరిగిపోయింది.

తనూ, ఆనందం.... మళ్లీ మామూలు యాంత్రిక జీవనం. అడపా దడపా అత్తమ్మ రాకపోకలూ, అడపదడచూ పిల్లలూ నగరసందర్శనం....

రోజులు, నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారి రెండేళ్ళు గడిచినై.

దసరా పండగ వెళ్లిపోయింది. విజయదశిమి మర్నాడు తనూ ఆనందం వరంగల్ నుంచీ తిరిగి వచ్చారు.

ఆ రాత్రి....

ఇంగ్లీష్ వార్తలు అయిన తర్వాత, టీవీని ఆఫ్ చేసి హాల్లో కూర్చున్నాడు ఆనందం. ఏదో పత్రిక తిరగేస్తున్నాడు.

అప్పుడు చెప్పింది రామసీత.

ఆమెకేసి అదోలా చూశాడు ఆనందం. ఆ చూపులో ఏ భావమూ తోచలేదు రామసీతకి.

క్షణాల నిశ్శబ్దం తర్వాత, తనే అన్నది సన్నగా, "ఏంవీ మాట్లాడరేం?" అని.

ఈ సారి తల పైకెత్తలేదు. "చెప్పావుగా. దీపావళి వెళ్లనీ చూద్దాం"

ఇప్పుడు....

అదిగో... ఆమాటే గుర్తుకొస్తోంది రామసీతకి. గుండెలో ఏదో గుబులు. అయోమయంగా భయం భయంగా ఉంది. అత్తగారు కళ్లల్లో కనిపిస్తుంది.

ఒకరోజు, తనూ, ఆనందం... పిల్లలూ, పోషణా... ఉద్యోగాలు చేసే దంపతులూ వాళ్ళ ఇబ్బందులూ మాట్లాడుకుంటుంటే ఆమె విన్నది. 'ఎంత ముసలి

దాన్నయినా ఈ మాత్రం అర్థంకాకపోదు. ఇబ్బందులు సొబ్బందులు అంటూ పిచ్చి చేష్టలు చేస్తేమాత్రం ఊరుకోను జాగ్రత్త' అంటూ భగ్గుమంది. ఆనందం అమ్మకూచి... సరేసరి!!

ఆ తరువాత కొన్నాళ్లకి ఆడపడచు వచ్చింది. తల్లి వెళ్లి తన సందేహాన్ని కూతురికి చెబితే ఆదరాబాదరాగా దిగింది కూతురు. "చూడు సీతా. నువ్వు అంతగా ఇదైపోకు. మీ అమ్మకు ఎటూ తప్పదు. కాసిన చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్లు ఆమె ఐదుగురి ఆడపిల్లల్ని, ఒక మొగ నలుసుని సాకిన మనిషే. నీ పిల్లలేం బరువు కారు ఆమెకి. అయినా, ఐదారేళ్ళు వస్తే తెచ్చి ఇక్కడే బళ్లో వేసుకోవచ్చు." అని నచ్చచెప్తున్నట్లు తనకు నచ్చినవి చెప్పిపోయింది. పోతూ పోతూ, "జాగ్రత్త సీతమ్మ తల్లీ, తొందరపడి ఏమన్న చేశారంటే మా అమ్మ గుండె పగిలి హరీ మంటుంది". అని ఓ హెచ్చరికని చేసి పోయింది.

ఆనందం అసలే మితభాషి. ఈ ప్రసక్తి తెస్తే అసలు మాట్లాడడనుకొని "కానీ చూద్దాం" తోనే మళ్లీ ప్రసవం అయిపోయింది!

అదీ... రజని జనన వృత్తాంతం! ఆమెనీ తల్లిదగ్గర చేర్చక తప్పలేదు.

ఇవన్నీ...

***

పాతికేళ్లకిందటి సంఘటనలూ, సంభవాలూ!

చల్లటి గాలితెమ్మెర రామసీతని ప్రస్తుతంలోకి తీసుకొచ్చింది. చుట్టూ చూసింది.

చీకటి జారుతోంది. అప్పటికప్పుడే గేటు తీసుకొని లోపలికి వస్తున్న ఆనందం కనిపించాడు.

ఆలోచనల్ని పక్కకు పెట్టి లోపలికి నడిచింది రామసీత. ఆనందంకు

కాఫీ ఇచ్చి ఎదురు సోఫాలో కూర్చుంది. కాఫీతో పాటు రమణ ఉత్తరాన్ని ఇచ్చింది. ఆ ఉత్తరమే రామసీత మనస్సుని ఒక కుదుపు కుదిపి, ఆలోచనల్ని గతంలోకి పరుగెత్తించి, గుండెల్లో రాయిని పడవేసింది!

ఉత్తరాన్ని చదివి అదోలా భార్యవైపు చూశాడు ఆనందం. యధాలాపంగా అన్నట్టు అన్నది రామసీత, "ఈ విషయాన్ని మనం కాస్త సీరియస్‌గా ఆలోచించాలి. నాకేమీ పాలు పోవడంలేదు. ఉత్తరం చూసినప్పట్నుంచీ ఏదో ఆందోళనా, ఆరాటం, భయం".

ఆనందం లేచి రామసీత పక్కకి వచ్చి కూర్చున్నాడు. ఠక్కున అతని అరచేతిని తన చేతుల్లోకి తీసుకొంటూ భర్త కళ్లల్లోకి చూసింది రామసీత.

ఆనందం మొహం కొద్దిగా రంగు మారింది. అతనూ ఆలోచనలో పడ్డాడు. కాఫీ కప్పుని టీపాయ్ మీద పెడుతూ అన్నాడు. నీ భయమూ, ఆందోళనా అర్థమైనై సీతా. కానీ చూద్దాం"

క్షణాల తరువాత.....

ఆనందం బయటికి వెళ్లిపోయాడు. రమణ ఉత్తరం రామసీత చేతిలోకొచ్చింది మళ్లీ.

మళ్లీ తన ఆలోచనలూ, తనలోకం- తనకు మిగిలినై... రామసీతకు.

మనస్సంతా తడిచీరలా అయిపోయింది.

మళ్లీ ఓసారి రమణ ఉత్తరాన్ని చదువుకుంది. ఎన్నిసార్లు చదువుకున్నా సారాంశం అదే! "పెళ్ళి విషయంలో నేనొక నిర్ణయానికి వచ్చాను. నా కొలీగ్ అరుణని చేసుకుందామనుకుంటున్నాను. ఆమెకు తల్లిదండ్రులు లేరు. అన్నయ్యా వదినా బొంబాయిలో ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన విషయాలు, వివరాలు ముఖాముఖి."

ఇదీ ఇవాళ రమణ తనకి పంపిన పేపర్ బాంబు!

మిగిలిన విషయాలు, వివరాలూ.... తన ఆందోళనా, భయం, ఆరాటం...!

పొడిగా నవ్వుకుంది రామసీత.

రాత్రి...

నిద్రకు ముందు,

"మీ నిర్ణయం చెప్పండి" అని దృఢంగా భర్తని అడిగింది రామసీత. అతను నవ్వేశాడు. 'పిచ్చి సీతా... నిర్ణయం వాడిది. వాడా నిర్ణయం చెప్పేశాడు. ఎందుకంత అప్‌సెట్ అయిపోతావ్. టేకిట్ ఈజీ" అని పుస్తకంలో తల దూర్చేశాడు ఆనందం.

రామ సీత కళ్లముందు ఆమె తల్లి రూపం నిలబడింది. గుండెల్లో గాలం పడినట్లయింది. మేధస్సంతా తేనెతుట్టలా అయిపోయింది. దేహాన్ని నిస్సత్తువ ఆవహించింది.

ఆ రాత్రి రమణ ఆలోచనలతోనే రామసీత - నిద్ర- పోయింది.

***

రమణ వచ్చి వెళ్ళాడు.

వెళ్తూ వెళ్తూ... చెప్పాడు, "రాణి చెప్పినా, వాళ్లాయన చెప్పినా, రజని చెప్పినా నా నిర్ణయం మారదు. వాళ్లకి ఉద్యోగం చెయ్యాల్సిన అవరం లేదు. నాకు ఎంప్లాయిడ్ గర్ల్‌ను పెళ్లి చేసుకోవడం ... మస్ట్. రెండు జీతాలు లేనిది నేను బతకలేను అంతే..." కరాఖండిగా చెప్పేశాడు.

రామసీత భయం నీడలు.. వాస్తవ రూపాలుగా ఎదుట నిలబడినై.

***

రామసీత తలపులూ, తలపోతలూ, పరివరి విధాలుగా సాగి పోతుండగానే... రమణ పెళ్లి అయిపోయింది! అరుణ ఆ యింటి కోడలుగా, అత్తమామలకు దూరంగా, బెంగుళూరులో కాపురం పెట్టింది. ఆఫీసుకు పదిరోజులు సెలవు పెట్టి బెంగుళూరు వెళ్లి కొత్తదంపతులకి కూడూ.. కుండా-కుదురు ఏర్పాటు

చేసి తిరిగి హైదరాబాదు వచ్చేసింది రామసీత..

***

జీవితంలో అనుభవాలే... కొందరి విషయంలో... అనుభవాల్లో జీవితం అవుతాయి. ఉదాహరణ రామసీత.!

రమణా, అరుణా- వారి కోరికల సాఫల్యాన్నీ, యవ్వన ఫలాన్నీ అందుకొనే శుభసమయం ఆసన్నమైంది.

తల్లిగా, అత్తగా... రామసీతకి ఆ కమ్మని వార్త మధురంగానూ, మనోజ్ఞంగానూ ఉంది. కానీ, కానీ,

బాధ్యత సంగతి? ప్రశ్నార్థకం!

ఈ సంతోషంలో, సందేహంలో ఆనందం కళ్లల్లోకి కోటి భాషలతో చూసింది, రామసీత. అదోలా అలవోకగా భార్య భుజంమీద తట్టి నెమ్మదిగా బయటికి వెళ్లిపోయాడు ఆనందం. నేలను తాకిన నావలా అయింది- రామసీత.!

***

నెలలు గిర్రున తిరుగుతున్నై. "ముందు నువ్ లాంగ్‌లీవ్ పెట్టు. ఆ తరువాత చూద్దాం. అవసరమైతే రిజయిన్ చెయ్యొచ్చు"... ఇదీ తండ్రీ కొడుకుల సలహా.

రామసీత మనస్సు అనేకానేక వలయాల్లో చిక్కుకుంది. పరిధిమీద ఎక్కడ ఆగినా అదే సమస్య. ఎంతదూరం పరుగెత్తినా ఆ వలయం అంచునే పరిభ్రమణం, అదే సమస్యని మళ్లీ మళ్లీ స్పృశిస్తూ, చుంబిస్తూ...... తట్టుకుంటూ, కొట్టుకుంటూ........

ఇంతకీ, సమస్య.... రెండు జీతాల్లేకపోతే వాళ్లు బతకలేకపోవడమా?...

ఉన్న ఉద్యోగానికి తాను రాజీనామా చేయడమా?... అరుణా- రమణలకు పుట్టబోయే బిడ్డ సంరక్షణా భారం?...

ఏమో మరి?... పరిధి చాలా విస్తృతంగా ఉంది.!!

***

(సాహిత్య నేత్రం)